


ఎస్. శివనాగేశ్వరరావు

# రేపటి తల్లి

"మీకు మీ అమ్మ కావాలో, నేను కావాలో తేల్చుకోండి!" అంది శాంత.

అయిదు సంవత్సరాల మాంగల్యబంధాన్ని తెంచుకోగల తెగింపు ఆమె స్వరంలో స్పష్టంగా కనిపించింది.

అటువంటి క్షణం ఎప్పుడైనా రాగలదని అతనూహించాడు. అయితే ఆ క్షణం అంత త్వరగా వస్తుందని మాత్రం అతనూహించలేదు. అతనికి భార్య స్వభావం తెలుసు. శాంతకు కోపం ఎక్కువ. తను కూడా తొందరపడితే వివాదం మరింత పెరుగుతుందని తెలిసిన రవీంద్ర "ఇప్పుడేమైంది శాంతా?" అన్నాడు నెమ్మదిగా.

"అయిదేళ్ల నుంచి పడుతున్నాను. ఇక నా వల్ల కాదు! నేను కావాలనుకుంటే మీ అమ్మను ఎక్కడికైనా పంపించేయండి. మీ అమ్మ కావాలనుకుంటే ఈ క్షణమే నేను పుట్టింటికి పోతాను. మనం విడాకులు తీసుకుందాం!" అంది శాంత.

ఆమె ఎప్పటిలా ఈసారి పెద్దగా అరిచి రాద్ధాంతం చేయలేదు. చెప్పదలుచుకున్న మాటలు చాలా కూల్‌గా చెప్పింది. శాంత తెగతెంపులకు సిద్ధపడిపోయిందని రవీంద్రకు తెలిసిపోయింది.

"నాకు మీ ఇద్దరూ కావాలి. ఏ ఒక్కర్నీ వదులుకోడానికి సిద్ధంగా లేను!" అన్నాడు.

"నేను మాత్రం మీ అమ్మను భరించే స్థితిలో లేను. ఇరవై నాలుగ్గంటలూ మనమధ్యనే ఉండి మన ఆనందానికి అడ్డుగోడగా నిలుస్తోంది. మీరు కాదంటే మిమ్మల్ని వదులుకోడానికైనా నేను సిద్ధంగా ఉన్నాను!" అంది శాంత.

"శాంతా! అమ్మకు నేను తప్ప వేరెవ్వరూ లేర్నని నీకు తెలుసు కదా! ఆమెను ఎక్కడికి పంపేది?"

"ఊళ్లో చాలా వృద్ధ శరణాలయాలున్నాయి. కావాలంటే నెలకింతని డబ్బివ్వండి. నేను కాదనను!"

"కన్నతల్లి ఋణం తీర్చుకునేది ఇలాగేనా? అంతటి కసాయిని కాదు నేను!" అన్నాడు రవీంద్ర.

"మీ అమ్మంటే మీకెంత ప్రేమో నాకు తెలియదా? మీరామెను ఈ ఇంటినుంచి పంపరని నాకు తెలుసు. అవసరమైతే నన్నే వదులుకుంటారని కూడా బాగా తెలుసు!" అంది శాంత వ్యంగ్యంగా.

"నాకు అమ్మంటేనే ప్రేమా? నీవంటే ప్రేమ లేదా?" అన్నాడు రవీంద్ర.

"ఉంది. కానీ ఆ ప్రేమ మీ అమ్మమీదున్న ప్రేమలో వందోవంతు కూడా ఉండదు!" అంది శాంత.

"అదే పొరపాటు. నాకు మీ ఇద్దరూ ఒకటే!"

"అది నోటి మాటే!"

"నిన్ను నమ్మించలేను!" అన్నాడు రవీంద్ర.

"ఇక మాటలు అనవసరం. నేను అడిగిన ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పండి. మీకు నేను కావాలా, మీ అమ్మ కావాలా?" రెట్టించింది శాంత.

"ఏ తోడూ లేని అరవై ఏళ్ల వృద్ధురాల్ని బయటకు పంపితే ఎలా బతకగలదు? శరణాలయానికి పంపి చేతులు దులిపేసుకునేంతటి రాతి మనిషిని కాదు!" అన్నాడు రవీంద్ర.

"అయితే నేనే వెళ్లిపోతాను!" అంది శాంత.

అప్పటికి రవీంద్ర కూడా విసిగిపోయాడు. తుమ్మితే ఊడిపోయే బంధాన్ని ఎంతకాలం నిలపగలడు? అతనూ ఓ నిర్ణయానికి వచ్చేశాడు.

"నీ ఇష్టం!" అన్నాడు ముక్తసరిగా.

శాంత లోపలకు వెళ్లి సూట్‌కేసులో తన బట్టలు, పావని బట్టలు సర్దింది. అది గమనించిన రవీంద్ర "పావ నా దగ్గరే ఉంటుంది!" అన్నాడు.

శాంత భర్తవంక చుర్రుగ్గా చూసింది. ఆ చూపు నిప్పుల వాన కురిపించినట్లుంది. "ముప్పై సంవత్సరాలు దాటిన మీరే ఇంకా అమ్మ కొంగు పట్టుకుని తిరుగుతున్నారు. అయిదేళ్లు దాటని పసిది అమ్మ లేకుండా ఎలా ఉండగలదు?" అంది శాంత.

"పాపకు అమ్మే కాదు, నాన్న కూడా కావాలి!" అన్నాడు రవీంద్ర.

"అది నన్ను కాదనుకుని మీ దగ్గరకు వస్తానంటే ఏ క్షణమైనా పంపుతాను!" అంది శాంత స్థిరంగా.

పావనికి అప్పటికే అమ్మా, నాన్నా ఘర్షణ పడుతున్న సంగతి తెలిసిపోయింది. తల్లి కొంగుచాటున భయంభయంగా తండ్రివంక చూడసాగింది. పావని తనను చూసి భయపడటం గమనించి రవీంద్ర సిగ్గుపడ్డాడు. పసిదాని ముందు తగవులాడుకోవలసిన పరిస్థితి దాపురించినందుకు కలత చెందాడు.

శాంత ఒక చేత్తో సూట్‌కేసు, మరో చేత్తో కూతుర్ని పట్టుకుని బయటకు నడుస్తూ, "నీవు, నీ అమ్మ కట్టకట్టుకు చావండి! నేను మాత్రం చచ్చినా ఈ గడప తొక్కను!" అంది కసిగా.

ఒక కర్కశ హస్తం మృదువైన పుష్పాన్ని తెంపి నలిపినట్లు, రవీంద్ర హృదయం బాధతో మెలితిరిగింది.

000

"పావనీ! నిన్ను నేను పెళ్లి చేసుకుంటాను. పైసా కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటాను. అయితే ఒక్క షరతు!" అన్నాడు చంద్రశేఖర్.

"ఆ షరతేమిటో చెప్పండి!" అంది పావని.

'నిన్ను కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటాను' అన్న చంద్రశేఖర్ మాట పావని హృదయాన్ని పన్నీటి జల్లులా తాకింది.

తనకు తండ్రి లేడు. తల్లి ఆర్థిక స్తోమత అంతంత మాత్రం. తనను చదివించడమే గగనమయింది. అదృష్టవశాత్తు చిన్న ఉద్యోగమేదో దొరికింది. అక్కడే పరిచయమయ్యాడు చంద్రశేఖర్. మనిషి అందగాడు, ఆస్తిపరుడు. ఉద్యోగం నామమాత్రం అతనికి. అతను తనను ఇష్టపడటం నిజంగా తన అదృష్టం.

చంద్రశేఖర్ తనను పెళ్లి చేసుకుంటానంటే తను ఎటువంటి త్యాగానికైనా సిద్ధం అనుకుంది మనసులో పావని.


"పావనీ! మనిద్దరి మధ్య వేరెవరూ ఉండటం నాకిష్టం లేదు!" చంద్రశేఖర్ తన మనసులోని ఉద్దేశ్యం స్పష్టంగా చెప్పాడు.

"అంటే ...?" సందేహంగా చూసింది పావని.

"మీ అమ్మ మన దగ్గర ఉండటం నాకెంతమాత్రం ఇష్టం లేదు!" చంద్రశేఖర్ ఆ విషయం చెప్పడానికి సందేహించలేదు.

"కానీ, మా అమ్మకు నేను తప్ప వేరెవ్వరూ లేరు!" పావని గొణిగింది.

"అందుకే చెబుతున్నాను, ఆలోచించు. నేను ప్రాక్టికల్ మనిషిని. నాకు నా సుఖం ముఖ్యం. నీవు కాదంటే నేను ఆనందంగా మరొక అమ్మాయిని పెళ్లి చేసుకోగలను. నా సలహా ఏమిటంటే, వయసులో ఉన్న మనం మన సుఖం చూసుకోవాలి. రేపో, మాపో కన్నుమూసే ముసలివాళ్ల గురించి ఆలోచించకూడదు. ఆపై నీ ఇష్టం! వారం రోజుల్లో నీ అభిప్రాయం చెప్పు!"



అన్నాడు చంద్రశేఖరు.

"అలాగే!" అంది పావని.

ఆ వారం రోజులూ పావని చంద్రశేఖర్ చెప్పిన విషయం గురించి ఆలోచించింది. ఎంతగా ఆలోచించినా మనసు చంద్రశేఖర్‌వైపే మొగ్గు చూపింది. తనిప్పుడు తల్లి గురించి ఆలోచిస్తూ తన భవిష్యత్‌ను శాశ్వతంగా అంధకారం చేసుకోవడం అవివేకమనిపించింది.

చంద్రశేఖర్ చెప్పినట్లు ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే, ముసలి తల్లి ఎంతోకాలం బతకదు. ఆమెకోసం అందివచ్చిన అవకాశం పాడు చేసుకోవడం మూర్ఖత్వమే అవుతుంది. అసలిటువంటి పరిస్థితి తన తల్లి తెచ్చుకున్నదే. భర్తతో గొడవపడి విడిపోయింది. పచ్చటి జీవితాన్ని మూర్ఖంగా నాశనం చేసుకుంది. తనకు తండ్రి లేకుండా చేసింది. చేసిన తప్పుకు శిక్ష అనుభవించక తప్పదు!

అంతగా కావాలంటే తాను చంద్రశేఖర్‌ని ఒప్పించి, తన జీతంలో ఎంతో కొంత ముట్టజెపుతుంది. నగరంలో ఎన్నో వృద్ధ శరణాలయాలున్నాయి. ఏదో ఒక దానిలో చేర్పిస్తే చాలు. తల్లి బతుకు నిశ్చింతగా గడిచిపోతుంది.

పావని నిర్ణయం తీసేసుకుంది.

వారం తరువాత చంద్రశేఖర్ "నేను చెప్పిన విషయం ఆలోచించావా?" అని అడిగాడు.

"మీ ఇష్టం! మీ రెలా చెప్తే అలా చేస్తాను. మిమ్మల్ని వదులుకోడానికి సిద్ధంగా లేను!" అంది పావని.

"వెరీ గుడ్! మంచి నిర్ణయం తీసుకున్నావు!" అభినందించాడు చంద్రశేఖర్.

పావని తల్లితో చంద్రశేఖర్ తనను కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటున్న విషయం చెప్పింది. అయితే అతను విధించిన షరతు గురించి మాత్రం చెప్పలేదు. ఆ విషయం ముందే చెప్పి తల్లి మనసు కష్టపెట్టడం కంటే పెళ్లి అయ్యాక ఒకేసారి చెప్పి, చల్లగా తప్పుకుంటే నయమని భావించింది.

000

"అమ్మకు, పావని వ్రాయునది...

ఆయన పెళ్లికి ముందే ఒక షరతు పెట్టారు. నీవు మాతో ఉండటానికి వీలువడదన్నది అతని షరతు. నీవంటే నాకు ప్రేమ ఉంది. అలానే నా భవిష్యత్ పట్ల భయమూ ఉంది. అందుకే ఆ షరతుకు ఒప్పుకున్నాను.

"నా జీతంలో కొంత నీకందజేస్తే నీ జీవితం గడిచిపోతుందని భావించాను. కానీ పెళ్లి తర్వాత, పైసలతో సహా నా జీతం తనకు అందజేయమని ఆయన చాలా కఠినంగా చెప్పారు. అంతటితో నీకూ, నాకూ సంబంధం పూర్తిగా తెగిపోయింది.

"అమ్మా! నన్ను అర్థం చేసుకో. నిన్ను నీ దారిన వదలి వెళ్లిపోయానని మాత్రం భావించకు. నేను అశక్తురాలిని.

ఇట్లు,
పావని."

ఆ ఉత్తరం అప్పటికి ఎన్నోసార్లు చదివింది శాంత. చదివి చదివీ కాగితం నలిగిపోయినట్లే ఆమె హృదయమూ నలిగిపోయింది.

'పెంచి పెద్దచేసిన తనను ఎంత తేలికగా వదులుకుని తన జీవితం తాను చూసుకుంది, పావని!' అనుకుంది శాంత. అయితే పావని చేసింది తప్పని అనుకోవడానికి శాంత మనసు పూర్తిగా సమ్మతించలేదు.

ఆనాడు భర్తతో వివాదపడింది అతని తల్లి విషయంలోనే. తమమధ్య వేరే వ్యక్తి ఉండడానికి తనిష్టపడనట్లే, ఇప్పుడు అల్లుడు ఇష్టపడలేదు. అందుకు కూతుర్నిగానీ, అల్లుడ్ని గానీ ఎలా తప్పుపట్టగలదు?

అయితే ఆనాడు తన భర్త పెంచి పెద్దచేసిన తల్లికోసం తనను అయిష్టంగా వదులుకున్నాడు. అదీ తను మూర్ఖంగా ఎడబాటు కోరబట్టి. అందులో అతని తప్పు ఎంతమాత్రమూ లేదు. అతనెంత ఉత్తముడు! తల్లిపట్ల తన బాధ్యత నిర్వర్తించడానికి ఎంత కట్టుబడ్డాడు? ఆ అనురాగం, బాధ్యత ఎంతమందికి ఉంటుంది?

అతని జీవితం నాశనం చేసింది తను కదూ! అతను మరలా పెళ్లి చేసుకోకుండా ఉండిపోయాడు తల్లి మరణించి ఇంట్లో దీపం పెట్టే దిక్కులేక ఎన్ని తిప్పలు పడుతున్నా... అది తెలిసీ తను కఠినంగా ఒంటరి బతుకు బతికింది?

అందుకే భగవంతుడు ఈనాడు, ఇన్నాళ్లూ తాను ఎవర్ని చూసి గర్వపడేదో, ఆ కూతుర్ని దూరం చేసి కఠినంగా శిక్షించాడు. ఇప్పుడు చాకిరీ చేసి బతకడానికి ఓపిక లేదు. పిడికెడు మెతుకులు పెట్టేవాళ్లు లేరు.

ఆనాడు తన భర్త ముసలి తల్లి, తమ దగ్గర ఉంటే తమ సుఖానికి అడ్డుగా భావించి ఛీత్కరించిందే కానీ, తాను కూడా 'రేపటి తల్లే' అన్న విషయం విస్మరించింది. అందుకు శిక్ష అనుభవించక తప్పదు. తన జీవితం మరెందరో రేపటితల్లులకు గుణపాఠం కావాలి అనుకుంది శాంత.

సంధ్య చీకట్లు అలుముకున్నాయి. దీపం వెలిగించడానికి కూడా ఓపిక లేక ఆ చీకట్లో అలానే ఉండిపోయింది శాంత. ■

కులమత భేదాలతో సంబంధం లేకుండా
ప్రతి నెలా అతి సులభంగా
స్కాలర్‌షిప్‌లు అందుకోండి!!
ప్రతి విద్యార్థి వద్ద ఉండాల్సినది..
ప్రతి తల్లిదండ్రులూ తమ పిల్లలకు
కానుకగా ఇవ్వవలసినది
స్కాలర్‌షిప్‌లు పొందడం ఎలా?
పి. విజయ్‌వర్మ
PROUD INDIA GROUP
42 దేశాల స్కాలర్‌షిప్‌లు మరియు ఉన్నత చదువుల కోసం వివిధ బ్యాంకుల వారు అందిస్తున్న ఆర్థిక రుణాలపై సమగ్ర సమాచారం.
మన దేశంలోనేకాక ప్రపంచంలోని అనేక దేశాలలోని విద్యా, వ్యాపార, సామాజిక సేవా సంస్థల వారు కొన్ని కోట్ల రూపాయలను ప్రతి ఏటా స్కాలర్‌షిప్‌ల రూపంలో అందిస్తున్నారు. కొన్నింటికి మీ పేదరికమే అర్హత కాగా మరికొన్నింటికి మీ ప్రతిభాపాటవాలే అర్హతలు. కులమతాలతో సంబంధం లేని ఈ స్కాలర్‌షిప్‌లతో మన దేశంలోనే కాక అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి 42కు పైగా దేశాలలో ఎటువంటి ఖర్చూ లేకుండా చదువుకోవచ్చు. మరియు వివిధ బ్యాంకుల వారు ఉన్నత చదువుల కోసం అందిస్తున్న ఆర్థిక రుణాలు ఆర్థికంగా వెనుకబడిన వారికి ఎంతగానో సహకరించగలవు. వెలకట్టలేని ఈ అమూల్యమైన సమాచారాన్ని రూ. 27/-ల ప్రత్యేక తగ్గింపుతో ఇప్పుడు కేవలం రూ. 99/- (పోస్టల్ ఛార్జీలు అదనం)లకే అందిస్తున్నాం. అన్ని వయసుల వారూ.. ఇంకా చెప్పాలంటే ఇంటి దగ్గర ఉండి చదువుకునేవారు కూడా ఎంతో ప్రయోజనాన్ని పొందదగ్గ ఓ చక్కని గైడ్ ఇది. అనేక ప్రయోజనాలతో మరియు ఎంతో విలువైన సమాచారంతో కూడిన ఈ పుస్తకం కావలసిన వారు ముందుగా ఏమాత్రం డబ్బులు చెల్లించకుండా కేవలం ఒక్క పోస్ట్‌కార్డ్ రాయడం ద్వారా వి.పి.పి.లో పొందవచ్చు. కాబట్టి ఇంత అమూల్యమైన ఈ స్కాలర్‌షిప్ గైడ్ కావలసిన వారు కేవలం రూ. 99/- (పోస్టల్ ఛార్జీలు అదనం) పోస్ట్‌మాన్‌కు చెల్లించి వి.పి.పి.లో గైడ్‌ను విడిపించుకుంటామని హామీ ఇస్తూ క్రింది చిరునామాకు ఒక పోస్ట్‌కార్డ్ రాయండి. లేదా ఫోన్ చేసి మీ చిరునామా తెలియజేసినట్లయితే మీకు పుస్తకాన్ని వి.పి.పి.లో పంపిస్తాం. పోస్ట్‌మాన్‌కు డబ్బులు చెల్లించి విడిపించుకోండి.
PROUD INDIA RESEARCH GROUP
9/2RT, PANJAGUTTA COLONY(P)
HYDERABAD - 82. Ph: 3303318
ఎటువంటి విద్యార్హత లేకుండా/విద్యార్హతతో
BA - B.Com - BCA
BBA - BSc - MA - M.Com
MBA - MCA - MSc
ప్రాస్పెక్టస్‌కై రూ.50/- పోస్ట్‌మాన్‌కు చెల్లించి వి.పి.పిలో విడిపించు కుంటామని హామీ ఇస్తూ క్రింది చిరునామాకు పోస్ట్‌కార్డ్ రాయండి.
MASTERS EDUCATION
9/2RT, PANJAGUTTA COLONY(P)
HYDERABAD - 82. Ph: 3303318